భక్తుల కొంగుబంగారం ఆది బసవేశ్వరాలయం



2



2

ఘనంగా యూత్‌కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## డిచ్‌పల్లి పీహెచ్‌సీ తనిఖీ

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రిసెప్షన్ సెంటర్, ఇన్‌పేషెంట్, ల్యాబ్ గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యుల వివరాలను తెలుసుకున్నారు. అలాగే సిబ్బంది రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సాధ్యమైనంత వరకు పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూభారతి దరఖాస్తులపై ఆరాతీశారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కార మార్గాలను చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.



# ఉమ్మడి జిల్లాలో ఘనంగా రాఖీ సంబురాలు



నాందేవ్‌వాడ అంగన్‌వాడీ కేంద్రంలో రాఖీ సంబురాలు

సోదరీసోదరుల ఆత్మీయతకు అద్దం పట్టేదే రక్షాబంధన్. కష్టసుఖాల్లో మీకు అండగా ఉంటామనే భరోసాను సోదరులు.. అక్కాచెల్లెళ్లకు కల్పించడమే రాఖీబంధం. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ చిహ్నానికి.. వారి మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఉమ్మడి జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు.

- అక్షరటుడే, ఇందూరు




బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు రాఖీ కట్టున్న మహిళ


– మిగతా ఫొటోలు 2 లో




బాన్సువాడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో..

## శ్రీరాంసాగర్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో..

**అక్షరటుడే ఆర్మూర్:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి క్రమంగా వరద వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 14,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ప్రాజెక్ట్ పరిధిలోని సుమారు 6 లక్షల ఎకరాలకు కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు. కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే సరస్వతి కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతలకు 180 క్యూసెక్కులు, గుత్ప ఎత్తిపోతలకు 270 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆవిరి రూపంలో 467 క్యూసెక్కులు మొత్తంగా 7,773 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నీటి విడుదల నవంబర్ 20 వరకు కొనసాగనుంది.

## ఘనంగా పద్మశాలి సంఘం 46వ తర్ప ప్రమాణ స్వీకారోత్సవం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని వినాయక నగర్ మహాలక్ష్మి పద్మశాలి సంఘం 46వ తర్ప నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని సంఘ భవనంలో శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా భక్తుల అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అప్పన్న గారి వెంకటేశం, కోశాధికారిగా చాట్ల రవీందర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో తర్ప మాజీ అధ్యక్షుడు గుజ్జేటి వెంకట నర్సయ్య, కొండ గంగాచరణ్, గౌరవ అధ్యక్షుడు చిలుక జగదీష్, మాజీ ప్రధాన కార్యదర్శి క్యాతం గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గజ్జల నాగేశ్వర రావు, బైస కృష్ణ, బిల్ల నారాయణ, శ్యామ్, పద్మ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# గడ్డిమందు అక్రమ దందా

**గడ్డిమందుతో భూమికి, ప్రజలకు ముంపు పొంచి ఉంది. అందులోనూ పలురకాల గడ్డిమందులు మరింత ప్రమాదకరం. అయినా ఫర్టిలైజర్ దుకాణాల్లో దొంగచాటుగా విక్రయిస్తున్నారు. డీలర్లు ఇష్టారాజ్యంగా గడ్డి మందులు అమ్ముతున్నా వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. తాజాగా ఫారెస్ట్ అధికారులు పంట పొలాలపై వాడకూడని గడ్డి మందును ఓ రైతు పొలంలో చల్లడం తీవ్ర చర్చకు దారి తీసింది.**

– అక్షరటుడే, కామారెడ్డి



సీతాయిపల్లిలో ఫారెస్ట్ అధికారులు గడ్డిమందును తన పొలంలో పిచికారీ చేయిస్తుండడంతో రోదిస్తున్న రైతు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డీలర్లు
- పట్టించుకోని అధికారులు

పొలంలో, గట్ల మీద గడ్డితో పంట దిగుబడి తగ్గుతుంది. దీంతో రైతులు గడ్డి మందులు వినియోగిస్తారు. అయితే గడ్డి మందుతో భూమితో పాటు ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఇందులో కొన్ని మందులు మరింత ప్రమాదకరం. వీటిని అవసరం మేరకు మాత్రమే వాడాలని, తప్పనిసరి పరిస్థితుల్లో అయితే ఇతర మందులు విక్రయించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రభుత్వ ఆదేశాలను వ్యాపారులు పట్టించుకోవడం లేదు. గడ్డిమందును చాలా మంది రైతులు వినియోగిస్తారు. దీంతో దొంగచాటుగా డీలర్లు విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా డబ్బులు తీసుకొని డబ్బాలు ఇస్తున్నారు. ఎవరైనా అడిగినా.. తమ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పొద్దని రైతులకు సూచిస్తున్నారు.

### అధికారుల అనుమతి తప్పనిసరి..?



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వ్యవసాయ భూముల్లో గడ్డి మందు పిచికారి నిషేధం. అయినా గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో పెరిగిన గడ్డిని తొలగించేందుకు మాత్రం ప్రభుత్వం అనుమతించింది. అయితే గడ్డిమందు అవసరమైన వారు స్థానిక వ్యవసాయ అధికారి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి ఉంటేనే డీలర్లు గడ్డిమందు విక్రయించాల్సి ఉంటుంది. ఈ నిబంధన అమలు కావడం లేదు.

### రైతు పొలంలో చల్లిన అధికారులు

వ్యవసాయ పొలాలపై వాడొద్దని ఆదేశాలున్న గడ్డిమందును ఫారెస్ట్ అధికారులు కొనుగోలు చేశారు. అంతేగాకుండా అటవీ భూమిలో పంట సాగు చేశారని రైతుల పొలంలో దానిని పిచికారీ చేశారు. గడ్డి మందును కొనుగోలు చేయడమే కాకుండా.. పొలంలో చల్లడంతో అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు అటవీ భూమిలో సాగు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ పొలంలో గడ్డి మందు పిచికారీ చేశారు. గడ్డి మందు చల్లితే పొలం పాడవుతుంది. దీంతో సదరు రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో అధికారులు అటవీ శాఖ అధికారులపై విచారణ చేస్తున్నట్లు సమాచారం.

### పర్యవేక్షణ కరువు

ఎరువులు, విత్తనాలు విక్రయించే వ్యాపారులు, డీలర్లపై వ్యవసాయ అధికారుల నిఘా కొరవడింది. ఇటీవల కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రైతుకు కాలం చెల్లిన గడ్డి మందును వ్యాపారులు విక్రయించారు. ఎరువులు, పురుగు మందు దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేయడం లేదు. వ్యాపారుల వద్ద మామూళ్లు తీసుకుంటూ వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే గడ్డి మందు కొనుగోలు చేయడంతో పాటు రైతు పొలంపై పిచికారీ చేసిన అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది తెలియాల్సి ఉంది.

### పొలంగట్లపై గడ్డికి మాత్రమే చల్లాలి..

గడ్డి మందు విక్రయాలపై ఎలాంటి నిషేధం లేదు. లేబుల్ క్లెయిమ్ ప్రకారం మాత్రమే విక్రయించాలి. ఆ మందు దేనికి ఉపయోగించాలి అనేది వ్యాపారులు రైతులకు స్పష్టంగా చెప్పాలి. పొలం చుట్టూ ఉన్న గడ్డి తొలగించడం కోసం మాత్రమే గడ్డి మందు వాడాలి. గాంధారి మండలంలో రైతు పొలంపై అటవీశాఖ అధికారులు గడ్డి మందు పిచికారీ చేసిన విషయం మా దృష్టికి రాలేదు. పత్రికల్లో చూస్తేనే మాకు తెలిసింది. ఫర్టి లైజర్ షాపులపై నిరంతర నిఘా ఉంది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం.

– మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

## శ్రీకృష్ణ జన్మాష్టమి కరపత్రాల విడుదల



**అక్షరటుడే, బాన్సువాడ:** కామారెడ్డి జిల్లా ఇస్కాన్ సత్సంగ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ మేరకు పట్టణంలోని వ్యాయామ శాల ఇస్కాన్ సత్సంగ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు వెంకటదాసు ప్రభుజి, గురు వినయ్‌కుమార్, మల్లికార్జున్ గురుస్వామి హాజరై మాట్లాడారు. ఈనెల 10 నుంచి 17 వరకు కామారెడ్డి ఇస్కాన్ సత్సంగంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 15న ఉదయం 11.30 గంటలకు ఉచిత శ్రీకృష్ణ హోమం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అర్ధరాత్రి వరకు జరుగుతాయని తెలిపారు. 17న నందోత్సవం, శ్రీల ప్రభుపాద వ్యాసపూజ ఉంటుందని, బాన్సువాడ, జుక్కల్, కామారెడ్డి ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

## బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని 11న సీపీఎం ధర్నా




**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రసాద్ తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మైనార్టీలకు రిజర్వేషన్లను అమలు జరుపుతున్నప్పటికీ తెలంగాణలో రాజకీయ దురుద్దేశంతో అడ్డుకోవడం సరైనది కాదన్నారు. కాంగ్రెస్ ఏకపక్షంగా పోరాడటం కన్నా.. అఖిలపక్షాలను కలుపుకొని కేంద్రం పైన ఒత్తిడి తేవడానికి ప్రయత్నించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, కార్యదర్శి వర్గ సభ్యుడు పెద్ది వెంకట రాములు, వెంకటేష్, శంకర్ గౌడ్, గంగాధర్, సుజాత, నన్నేసాబ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ యూనిట్ల ఏర్పాటు

**అక్షరటుడే, ఇందూరు:** గ్రామ పంచాయతీ భవనం మొదలుకొని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంత్రి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ తదితరులతో కలిసి కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం అమలు చేయనున్నట్లు వివరించారు. ఇరిగేషన్, దేవాదాయ తదితర శాఖల పరిధిలోని ఖాళీ భూముల్లో సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిజిల్లా కలెక్టరేట్ పై, పార్కింగ్, క్యాంటీన్ల వద్ద సోలార్ యూనిట్ల ఏర్పాటు కోసం ప్రణాళికల రూపొందించి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లు ఒకే నమూనాలో నిర్మించినందున.. అనుకూలమైన డిజైన్లను హైదరాబాద్ నుంచి ఎంపిక చేసి పంపిస్తున్నట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. అలాగే జిల్లా కార్యాలయాల నుంచి మంచి డిజైన్లు ఉంటే పంపాలని సూచించారు. జిల్లా వివరాలకు సంబంధించి ఫార్మాట్ అందజేస్తామని, పూర్తి వివరాలు నమోదు చేసి పంపాలని ఆదేశించారు.

## గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి..


**అక్షరటుడే, నిజాంసాగర్:** నియోజకవర్గంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. పిట్లం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయాలన్నారు. అనంతరం నాయకులు మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నీటి సౌకర్యం, రోడ్లు, తాగునీరు, గ్రామాల్లో నిలిచి పోయిన భవన నిర్మాణ పనులు, కాంపౌండ్ వాల్, డ్రెయినేజీలు వంటి మౌలిక సదుపాయాల గురించి ఎమ్మెల్యేతో వారు చర్చించారు. దీంతో ఎమ్మెల్యే ఆయా శాఖలకు చెందిన అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చొరవ చూపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు హన్మాండ్లు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, సాయిరెడ్డితో పాటు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.





## చందాలు వేసి.. గుంతలు పూడ్చి..

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని మహాలక్ష్మి కాలనీలో రోడ్డు సదుపాయం సరిగ్గా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షాలతో కాలనీకి వెళ్లే దారంతా గుంతల మయంగా మారడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో కాలనీవాసులు పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో అపార్ట్‌మెంట్‌వాసులే చందాలు వేసుకుని గుంతలను పూడ్చుకున్నారు. ఈ సందర్భంగా సాయి టవర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ..తమ కాలనీలో సమస్యలను పరిష్కరించకుంటే కార్పొరేషన్ ఎన్నికలను బహిష్కరిస్తామని, పన్నులు సైతం చెల్లించకూడదని నిర్ణయం తీసుకున్నామని తెలి పారు. కార్యక్రమంలో కార్యదర్శి బాల్ రావు, కోశాధికారి రాజు, సలహాదారులు సింహాచలం, సంజీవరెడ్డి, వరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



## కొమురం భీమ్ విగ్రహావిష్కరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహాన్ని జెడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహ దాత కొండాపురం స్వప్న రఘు, సాయన్న, ఆదివాసి నాయక్ పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, గౌరవ అధ్యక్షుడు బండారి భోజన్న, ఉపాధ్యక్షుడు అంజయ్య, గంగ నర్సయ్య, అన్నం సాయిలు, కొండా శ్రీనివాస్, మెట్టు అశోక్, విఠల్, కుల పెద్దలు మేకల భూమన్న, వంత భూమన్న పాల్గొన్నారు.

## ఇత్వార్‌పేటలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను బాల్కొండ మండలం ఇత్వార్ పేట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం పిలుపుమేరకు నాయక్‌పోడ్ కులస్థులు గ్రామంలో ఆదివాసీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల కోసం పోరాడి అమరులైన వీరులను స్మరించుకొని వారి త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొంకి గణేష్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా శనివారం మండలంలోని హన్మాజీపేట గ్రామంలో కొమురం భీం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్.. జంగల్..జమీన్ నినాదంతో పోరాటం చేసిన కొమురం భీమ్ ఆశయాలు సాధించే దిశగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పేంకటి గణేష్, కొంకి పోచయ్య, మ్యకల లింగం, కొంకి రాజు, కొంకి చిరంజీవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారంగా బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలోని ఆదిబసవేశ్వర ఆలయం విలసిల్లుతోంది. స్వయంభుగా వెలియడం ఈ ఆలయం ప్రత్యేకత. గర్భగుడిలోని ఆది బసవేశ్వరుని నంది విగ్రహం ఏటేటా పెరుగుతూ వస్తుందని భక్తుల నమ్మకం. ఈ ఆలయానికి దాదాపు 400 ఏళ్ల చరిత్ర ఉంది. - అక్షరటుడే, బాన్సువాడ




# భక్తుల కొంగుబంగారం..
# ఆది బసవేశ్వరాలయం

▸ పచ్చనిగుట్టల్లో వెలిసిన ఆలయం ▸ 400 ఏళ్ల పురాతన చరిత్ర

ఆలయంలోని నందీశ్వరుడిని దర్శించుకునేందుకు తెలంగాణ ప్రజలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకతో రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారు. ఆలయ నిర్వహణ బిచ్కుంద బసవేశ్వర మఠం ఆధ్వర్యంలో కొనసాగుతోంది.

**ఎత్తైన గుట్టపై..**

బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని ఎత్తయిన రాతి గుట్టపై పచ్చని చెట్ల మధ్య ఆలయం వెలిసింది. 400ఏళ్ల క్రితం బిచ్కుంద మఠాధిపతి మడిమాలప్ప స్వామి కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లగా ఆయన శిష్యుడు గురువుకు కోడె దూడను బహుమానంగా ఇస్తాడు. మఠానికి కానుకగా ఇచ్చిన కోడెను బిచ్కుంద మఠానికి తీసుకొస్తారు. అయితే మడిమాలప్ప జొన్నచేను ప్రతిరోజూ రాత్రి అరఎకరం చొప్పున తరిగిపోతూ వచ్చింది. కారణం తెలుసుకోడానికి పంటపై మడిమాలప్ప నిఘా ఉంచుతాడు. ఓ రోజు అర్ధరాత్రి వేళ కోడెదూడ వచ్చి జొన్న చేను మేయడం కాపలాదారులు చూస్తారు. కోడెను పట్టుకోడానికి ప్రయత్నిస్తుండగా బోర్లం గుట్ట వద్ద అంబా అంటూ రంకె వేయగా అరుపులతో అక్కడ పెద్ద బావి వెలిసింది.



అది చూసి కాపలాదారుడు భయంతో పారిపోతుండగా కోడె బావిలోకి దూకి గుప్తమైంది. ఓ గొర్రెల కాపరి చూడగా అప్పుడు ఆది బసవేశ్వరుడు మానవరూపంలో ప్రత్యక్షమై ఈ విషయాన్ని గ్రామస్థులెవరికీ చెప్పవద్దని చెప్పి మాయమైందని చరిత్ర చెబుతున్నది. బసవేశ్వరుడు ఓ రోజు మడిమాలప్ప స్వామి కలలోకి వచ్చి బీదర్‌లో కానుకగా ఇచ్చిన దూడ తానేనని ఇక్కడే గుప్తమైనట్లు తెలిపి తన ముందు శివలింగాన్ని ప్రతిష్ఠించమని ఆజ్ఞాపించినట్లు పురాణాలు చెబుతున్నాయి. మడిమాలప్ప స్వామి బిచ్కుంద నుంచి శివలింగాన్ని నేల బొయ్యారం ద్వారా బోర్లం గ్రామానికి తీసుకొచ్చి బసవేశ్వరుడి ముందు ప్రతిష్ఠించి పూజలు చేశాడని ప్రతీతి. అప్పటి నుంచి ఈ ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



## బాధిత కుటుంబాలకు పరామర్శ

**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ మండలంలోని పలువురు బాధిత కుటుంబాలను బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పురాణీపేట్ గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ రాధాబాయి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే కుప్కల్ గ్రామ బీజేపీ బూత్ స్థాయి అధ్యక్షుడు రాజ ముత్యం తండ్రి అనారోగ్యంతో మరణించారు. కాగా ఆయన్ని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆరె రవీందర్, పట్టణ అధ్యక్షుడు కనికరం మధు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తోట గంగాధర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యోగేశ్వర నరసయ్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారు లక్ష్మణ్ గౌడ్ , సీనియర్ నాయకులు కొండ గంగాధర్ తదితరులున్నారు.

## జాతీయ రహదారిపై మృతదేహం లభ్యం

**అక్షరటుడే, ఇందల్వాయి:** ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రయాన్ పల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో గుర్తుపట్టలేకుండా ఉందని పేర్కొన్నారు. మృతి చెందిన వ్యక్తిపై నేవీ బ్లూ కలర్ ప్యాంట్, వైట్ బనియన్, వైట్ అండ్ బ్రౌన్ చెక్స్ షర్ట్ ఉందని.. ఎవరికైనా సమాచారం తెలిస్తే.. ఇందల్వాయి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సందీప్ సూచించారు.

## దొంగసొత్తు కొనుగోలు చేసిన ఇద్దరు అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** అంతర్రాష్ట దొంగల ముఠా చేసిన కార్యకాలాపాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్‌లో గతంలో నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు రెండు రోజుల క్రితం 8 నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న భాస్కర్ చవాన్ అనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా పార్థీ గ్యాంగ్ దోచుకున్న సొత్తును కొనుగోలు చేసే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. భాస్కర్ చవాన్‌ను విచారించగా ఆయన తెలిపిన సమాచారం మేరకు..మహారాష్ట్రకు చెందిన బీదర్ అభిషేక్, ఇర్ఫాన్ నూర్ఖాన్‌లను గాంధారి పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. దొంగసొత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ కొనొద్దని, ఒకవేళ కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


పోతంగల్ మండల కేంద్రంలో..


భీమ్‌గల్ మండల కేంద్రంలో..



ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..


నిజాంసాగర్ మండల కేంద్రంలో..


బాల్కొండ మండల కేంద్రంలో..

## ఘనంగా యువజన కాంగ్రెస్ దినోత్సవం

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఉమ్మడిజిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని కూడళ్లలో ఏర్పాటు చేసిన జెండాలను ఆవిష్కరించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ఆలోచనతో మొదలైన యూత్ కాంగ్రెస్ దేశం నలుమూలలకు విస్తరించిందని నాయకులు పేర్కొన్నారు. రాహుల్‌గాంధీని పీఎంగా చేయడమే యూత్ కాంగ్రెస్ లక్ష్యమని వారు వివరించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



## ఎంఐఎంలో పలువురి చేరిక

**అక్షరటుడే, బోధన్:** సాలూర మండలం ఫతేపూర్ గ్రామానికి చెందిన యువకులు శనివారం బీఆర్ఎస్ నుంచి ఎంఐఎం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాజ్ అలీ, కార్యదర్శి అహ్మద్ బిన్ మోసిన్‌లు వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాజ్ అలీ మాట్లాడుతూ.. గ్రామ సమస్యలే కాకుండా పార్టీకి చెందిన కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా వెన్నంటి ఉంటామని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ అసదుద్దీన్ ఒవైసీ చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ప్రకటించారు.

# ఉమ్మడి జిల్లాలో ఘనంగా రాఖీ సంబురాలు


జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్‌లో రాఖీలు కడుతున్న చిన్నారులు


నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో..


కోటగిరిలో..


రాఖీ కడుతున్న సుధాం లక్ష్మి


రాఖీ కడుతున్న ఆకుల లలిత


నగరంలోని బస్టాండ్‌లో రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల సందడి కనిపించింది. మహిళలు బస్సుల్లో సీట్లు దొరకకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్




బాన్సువాడ దుర్కిలో..


ఏఎస్సైకి రాఖీ కడుతున్న విద్యార్థిని


తమ్ముడికి రాఖీ కడుతున్న ఆకుల సుజాత


ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి


వినయ్‌రెడ్డికి రాఖీ..


బిచ్కుంద మండల కేంద్రంలో..


పిట్లం మండల కేంద్రంలో..


మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి


నగరంలోని అమరవీరుల పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు రాఖీ కడుతున్న సోదరి